వేడుకగా వినాయక నిమజ్జనం




బందోబస్తులో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, పోలీసు అధికారులు, యువకులకు అభివాదం చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, మేయర్ శిరీష, కమిషనర్



రాత్రి సమయంలో వినాయక నిమజ్జనం చేస్తున్న భక్తులు, వినాయకసాగర్ వద్ద లైటింగ్ దృశ్యాలు

- గణనాథుడికి ఘన వీడ్కోలు
- వినాయకసాగర్ వద్ద పటిష్ట భద్రత
- వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు భేష్
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: తిరుపతి నగరంలో శ్రీవినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన విగ్రహానికి తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా వినాయకసాగర్ వద్దకు తీసుకుని వచ్చి మొదట నిమజ్జనం చేశారు. అనంతరం నగరంలో పలుచోట్ల కొలువైన విగ్రహాలను మండపాల నిర్వాహకులు వరుస క్రమంలో వినాయకసాగర్‌కు తరలించారు. కరకంబాడి మార్గంలోని ఎస్వీపూర్ హోమ్ వద్ద శ్రీవరసిద్ధి వినాయక నిమజ్జన, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వాగత వేదిక ఏర్పాటు చేశారు. ఊరేగింపుగా నిమజ్జనానికి వచ్చే విగ్రహాలకు టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, కమిషనర్ హరిత, కమిటీ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్ తదితరులు స్వాగతం పలికారు. వైఎస్సార్ మార్గం, లీలామహల్–కరకంబాడి మార్గాల్లో పెద్దఎత్తున పోలీసులను నియమించి వాహనాల రాకపోకలను పర్యవేక్షించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సాగర్ ట్యాంక్ బండ్‌పై ప్రత్యేకంగా దశావతార మండపాన్ని ఏర్పాటు చేసి వేంకటేశ్వరస్వామి, గోవిందకోటి లిఖిత వినాయక స్వామి విగ్రహాలను తీర్చిదిద్దారు. నగరంలో సుమారు 1000 విగ్రహాలను ఏర్పాటు చేశారని, తొలి రోజు చిన్న విగ్రహాలను నిమజ్జనం చేశారని, మూడో రోజున 500 విగ్రహాలను నిమజ్జనం చేశారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మిగిలిన విగ్రహాలను ఐదు, తొమ్మిదో రోజున నిమజ్జనం చేసే అవకాశం ఉందని తెలిపారు.



భక్తులకు సూచనలు చేస్తున్న అధికారి

వినాయక నిమజ్జన ఏర్పాట్లు భేష్

తిరుపతి నగరంలోని వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు తిరుపతి కార్పొరేషన్ చేసిన ఏర్పాట్లు భేషుగ్గా ఉన్నాయని ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అభినందించారు. వినాయకసాగర్‌ను పరిశుభ్రంగా ఉంచడం, భక్తులకు తాగునీటి వసతి కల్పించడం, వినాయక నిమజ్జనం చేసేందుకు వీలుగా భారీ క్రేన్‌లు ఏర్పాటు చేయడంపై కొనియాడారు. వినాయకసాగర్‌ను తిరుపతి మహానగరంలో సందర్శన ప్రాంతంగా అభివృద్ధి చేసినట్టు చెప్పారు.



యువతీ యువకుల కేరింతలు



వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న ప్రజలు





వినాయక సాగర్ వద్దకు తరలివచ్చిన ప్రజలు

క్లుప్తంగా

అక్కినేనికి రంగస్థలి నివాళి

తిరుపతి కల్చరల్: సినీ నటుడిగా తన అభినయంతో తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అక్కినేని నాగేశ్వరావు జయంతిని బుధవారం రంగస్థలి కార్యాలయంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, కార్యదర్శి కేఎస్.రాజా, అక్కినపల్లి మునిక్రిష్ణయ్య, సాంబోలు హరినాథ్, సుబ్రమణ్యం రెడ్డి, కె.కేశవరెడ్డి, తిరుమలయ్య, కళాకారులు పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఇటీవల మృతి చెందిన ఇరువురి మెకానిక్ కుటుంబాలకు బుధవారం తిరుపతి టూ వీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. గాంధీ భవన్ ఆవరణలో నిర్వహించిన అసోసియేషన్ నెలవారి సమావేశంలో పుదిపట్లకు చెందిన మెకానిక్ లీలా కుమార్, తుమ్మలగుంటకు చెందిన మెకానిక్ నేతాజీరెడ్డి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున అందించి భరోసా కల్పించారు.

రోశమ్మ కుటుంబానికి పరామర్శ



రోశమ్మ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న రఘునాథరెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని మిట్టకండ్రిగ గ్రామానికి చెందిన రోశమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న తిరుపతి జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట సచివాలయ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, ఢిల్లీరెడ్డి ఉన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

పాకాల: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని ఎంఈవో బాబ్జీ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో ప్రభాకర్ సమక్షంలో సచివాలయ విద్యా సహాయకులు, సీఆర్పీలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలు బడిలో ఉండాలన్నారు. 10వ తరగతి పూర్తిచేసిన వారు ఇంటర్‌లో చేరేలా చూడాలన్నారు. 10వ తరగతి తప్పిన వారు మళ్లీ ఫీజు కట్టి పరీక్షలు రాయవచ్చన్నారు. ఎంఈఓ–2 లింగయ్య పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

నగరి: సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి విద్యావిధానం విశిష్టతను తెలియజేస్తూ ప్రాంతీయ, జిల్లా, రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవా ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం బుధవారం తెలిపారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీలోపు చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లోని విద్యార్థులకు ప్రత్యేక వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు.

తుమ్మలగుంటకు పోటెత్తిన భక్తులు



నెమలి పింఛ వినాయకుడి సేవలో ఎస్పీ పరమేశ్వరరెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుమ్మలగుంటకు భక్తులు పోటెత్తారు. కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలతో పాటు నెమలిపింఛ వినాయకుడిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో బుధవారం తరలివచ్చారు. తుమ్మలగుంటలో 34 అడుగుల ఎత్తు, 15 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేసిన రాష్ట్రంలోనే అతి పెద్ద నెమలిపింఛ వినాయకున్ని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఆయన వెంట అదనపు ఎస్పీ కులశేఖర్, డీఎస్పీలు నరసప్ప, యశ్వంత్ ఉన్నారు. ఆ తర్వాత కల్యాణ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ముత్యపు పందిరి వాహన సేవలో పాల్గొన్నారు. వీరికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



నెమలి పింఛ వినాయకుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తిరుపతి కల్చరల్: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా మహతి కళాక్షేత్రం, అన్నమాచార్య కళామందిరం, రామచంద్ర పుష్కరిని కళా వేదికలపై బుధవారం సాయంత్రం కళాకారులు ప్రదర్శించిన సంగీత, నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. మహతి కళాక్షేత్రంలో ప్రముఖ సంగీత విద్యాంసులు ఏఎస్.గిరీష్, పి.రవిసుబ్రమణ్యం బృందం ఆలపించిన గానామృతం శ్రవణానందకరంగా సాగింది. అలాగే అన్నమాచార్య కళామందిరంలో ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల వయోలిన్ వాయిద్య సంగీతం సభికుల హృదయాలను రంజింపజేసింది. రామచంద్ర పుష్కరిణి వేదికపై కే.ప్రసాద్, కె.హరిప్రసాదరావు సంగీత కచేరి భక్తులను ఆకట్టుకుంది.

వినాయక పూజ పత్రిపై ఎగ్జిబిషన్

పాకాల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వృక్షశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో వినాయక చవితి పూజ పత్రిపై మినీ ఎగ్జిబిషన్‌ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మొహిద్దీన్‌బాషా మాట్లాడుతూ ప్రకృతిలో ఉన్న ఔషధ మొక్కల గురించి ఇతరులకు తెలియజేయాల్సిన బాధ్యత వృక్షశాస్త్రం విద్యార్థులపై ఉందన్నారు. వృక్షశాస్త్రం విభాగాధిపతి మోమన్‌బెహారా వినాయక పూజలో వినియోగించే 21 రకాల పత్రికి ఉన్న ఆయుర్వేద, ఔషధ గుణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సురేంద్ర, అధ్యాపకులు రమేష్ కుమార్, ఈశ్వర్‌బాబు, మాశిలామణి, చిట్టి కళావతి, ఆదిశేఖర్‌రెడ్డి, రమణమ్మ, రవి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, విష్ణుప్రియ, లక్ష్మీప్రసన్న, మాధవి పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

పాకాల: మండలంలోని ఇరంగారిపల్లి పంచాయతీలో ఉపాధి హామీ కింద చేపట్టిన సప్లయి చానల్ పనులను పీడీ శ్రీనివాసప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్య, పనుల కల్పన, గిట్టుబాటు కూలిపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతులు ఉపాధి హామీ కింద మామిడి, పండ్ల తోటలు సాగు చేసుకోవాలని సూచించారు. పొలాల్లో ఫారంపాండ్స్ తవ్వుకోవడం ద్వారా వర్షం పడిన సమయంలో నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీవో కళ్యాణి, జేఈ ఈశ్వర్, టీఏ బాలకృష్ణ, ఎఫ్ఏ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల ఆధునీకీకరణకే భూ సర్వే



భూ సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

రామచంద్రాపురం: రెవెన్యూ రికార్డులను ఆధునీకరించేందుకే భూ సర్వే చేస్తున్నట్లు ఆర్ఐ క్రిష్ణమ్మ తెలిపారు. ఆమె బుధవారం బ్రాహ్మణకాల్వలో భూ సర్వే ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు తమ పొలాల హద్దులను చూపడానికే ప్రభుత్వం భూ రీసర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు నకళ్లు, 2 ఫొటోలను రెవెన్యూ అధికారులకు అందజేయాలని సూచించారు. సర్వేయర్ హేమకుమార్, వీఆర్వోలు సతీష్‌కుమార్, ప్రసాద్, విలేజ్ సర్వేయర్లు షణ్ముగం, గుణశేఖర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్, టెక్నాలజీ విద్యార్థుల ఇండక్షన్ కార్యక్రమం

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో బీటెక్ కోర్సుల్లో కొత్తగా ప్రవేశం పొందిన విద్యార్థుల కోసం బుధవారం స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇది విద్యార్థులు కొత్త వాతావరణంలో సుఖంగా ఉండడం, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మంచి సంబంధాలు ఏర్పరుచుకోవడానికి దోహదం చేస్తుంది. ఇందులో భాగంగా యోగా, ధ్యానంతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. అలాగే విద్యార్థులు మహిళలు, వారసత్వం, సార్వత్రిక మానవ విలువలు, డిజైన్ థింకింగ్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ గురించి పలువురు ప్రముఖులు తెలిపారు. అనంతరం లైఫ్ స్కిల్స్, ఇంగ్లీష్ డయాగ్నస్టిక్ టెస్ట్, లిటరరీ ఈవెంట్స్, ఆప్టిట్యూడ్, మ్యాథమేటికల్ స్కిల్స్, ఎస్పీఎంవీవీలోని ఇంక్యుబేషన్ సెంటర్లు, చంద్రగి కోట, ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం తదితర ప్రదేశాలను సందర్శించారు. ప్రొఫెసర్ మల్లికార్జున, ఎస్ఓఈటీ డైరెక్టర్ జి.సుప్రియ, ఇండక్షన్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ ఎ.హరిత పాల్గొన్నారు.

తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడిగా వైఎస్.బాబు



వైఎస్.బాబు



యు.ప్రసాదరావు

తిరుపతి కల్చరల్: తిరుపతి ఫిలిం సొసైటీ అధ్యక్షుడిగా వైఎస్.బాబు, కోశాధికారిగా యు.ప్రసాదరావును నియమించినట్టు సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి ఫిలిం సొసైటీ పూర్వపు అధ్యక్షుడు పి.గురివిరెడ్డి అనారోగ్యరీత్యా స్వచ్ఛందంగా రాజీనామా చేశారని, ఉపాధ్యక్షుడు బుచ్చిబాబు పని ఒత్తిడి కారణంగా రాజీనామా చేశారని తెలిపారు. సొసైటీ కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించి నూతన అధ్యక్ష, కోశాధికారులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నవంబర్ 13న కార్తీక వనభోజనం, 27న 8వ సారి కార్తీక కోటి దీపోత్సవం, డిసెంబర్ 10, 11వ తేదీల్లో ఘంటసాల జయంతి ఉత్సవాలను అత్యంత వేడుకగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి ఫిలిం సొసైటీ కార్యదర్శి సీఆర్‌కే.శేషగిరిరావు, బుజ్జిబాబు, శాంతావాణి, అనసూయ, భాస్కర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరులో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడోరోజు ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. సర్పంచ్ రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారి దేవేరి కొలువైన తిరుచానూరు మతసామరస్యానికి ప్రతీక అని, ఇక్కడి ప్రజలందరూ కలిసికట్టుగా వేడుకలను చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నరేష్‌రెడ్డి, యోగానందరెడ్డి, వార్డు సభ్యుడు మునీంద్రరాయల్, చంద్రశేఖర్ ఆజాద్, ఆర్ఆర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి

నాదముని యాదవ్ మృతి తీరనిలోటు

చంద్రగిరి: సీనియర్ పాత్రికేయుడు నాదముని యాదవ్ మృతి తీరనిలోటని తిరుపతి ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర తెలిపారు. పనపాకంపేట గ్రామంలో బుధవారం నాదముని యాదవ్ కర్మక్రియలు నిర్వహించారు. ఇందులో ఆయన చంద్రగిరి పాత్రికేయులతో కలిసి పాల్గొన్నారు. నాదముని యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ తరపున వారి కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయంన్ని అందజేశారు. కార్యక్రమంలో లీలాకృష్ణ, భూమిరెడ్డి నరేష్, మహేష్, గల్లా సుబ్రమణ్యం, కన్నయ్య, సురేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



నాదముని యాదవ్ కుటుంబ సభ్యులకు చెక్కు ఇస్తున్న ప్రెస్‌క్లబ్ కార్యదర్శి బాలచంద్ర

అందరికీ గరుడసేవ వీక్షణ భాగ్యం

- ఎక్కువమంది దర్శించుకునేందుకు ప్రత్యేక వ్యూహాలు
- ముత్యపు పందిరి సేవలో ప్రయోగాత్మక పరిశీలన


తిరుమల: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడ వాహన సేవలో భక్తులందరూ వాహనంపై కొలువైన స్వామిని దగ్గరగా వెళ్లి దర్శించుకునేందుకు టీటీడీ ఈసారి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. అందులో భాగంగా బుధవారం రాత్రి ముత్యపు పందిరి వాహన సేవలో ప్రయోగాత్మకంగా పరిశీలించింది. రాత్రి ముత్యపు పందిరిపై స్వామి అమ్మవార్లు విహరిస్తున్న సమయంలో గ్యాలరీల్లో ఉన్న భక్తులను సుపథం వద్ద నుంచి అనుమతించి దగ్గరగా వాహనంపై కొలువైన స్వామి దర్శనం కల్పించారు. అనంతరం వారిని తూర్పు మాడ వీధిలోకి పంపారు. తిరిగి గ్యాలరీల్లోకి మరికొందరు భక్తులను పంపి వారు కూడా వాహన సేవను దగ్గరగా వీక్షించాక మరో మార్గంలో నుంచి వెలుపలకు పంపారు. ఈ సందర్భంగా భక్తులు గోవిందనామ స్మరణలతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. కళాబృందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి స్వయంగా ఈ ఏర్పాట్లను పరిశీలించారు.



ముత్యపు పందిరి వాహన సేవలో భక్తులు



వాహనసేవను వీక్షించి మరో మార్గంలో వెలుపలకు వస్తున్న భక్తులు




కళాబృందాల ప్రదర్శన



స్వామివారికి హారతి పడుతున్న భక్తులు

చురుగ్గా ఆపరేషన్ చిరుత

అలిపిరి కాలినడక మార్గంలో ఇటీవల చిరుతలు భక్తులపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి ఆదేశాలతో టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులు ఆపరేషన్ చిరుతకు శ్రీకారం చుట్టారు. ఫారెస్ట్ సిబ్బంది శ్రీవారి భక్తులు రక్షణార్థం అలిపిరి, శ్రీవారి మెట్ల మార్గాలలో చిరుత సంచారం ఉన్న ప్రాంతాల్లో కెమెరాలు అమర్చి 27 గంటలూ పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు చిరుతలను గుర్తించారు. అదేవిధంగా ప్రత్యేక 18 మంది పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి 24 గంటలూ చిరుత సంచరించే ప్రాంతాల్లో తిరుగుతూ ఎప్పటికప్పుడు అధికారులకు సమాచారాన్ని చేరవేస్తున్నారు. తద్వారా భక్తులకు భరోసా కల్పిస్తున్నారు.



చిరుత సంచరించే ప్రాంతాల్లో ఆయుధాలతో పోలీసుల గస్తీ

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి